క్లుప్తంగా

లక్ష్య సాధనకు కష్ట పడాలి



మంగళగిరి టౌన్ : లక్ష్య సాధనకు బాలబాలికలు కష్టపడి చదువుకోవాలని ఆంధ్రప్రదేశ్ పోలీస్ అధికారుల సంఘం ముఖ్య సలహాదారులు అద్దేపల్లి గణపతి సూచించారు. మంగళగిరి నగర పరిధిలోని చినకాకాని షైన్ ఆనంద శరణాలయంలో శనివారం పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటేనే ఏదైనా సాధించగలమని తెలిపారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలని సూచించారు. బాలబాలికలతో కేక్‌ను కట్ చేయించారు. అనంతరం శరణాలయం నిర్వాహకులు, బాలబాలికలు గణపతిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ నరసింహ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ మోహనరావు, ఆంధ్రప్రదేశ్ జియో జీఎం అనూఫ్, షైన్ ఫౌండేషన్ చైర్మన్ డీజీ నాయక్ పాల్గొన్నారు.

ప్రచ'ఎండ'తో రోడ్లన్నీ నిర్మానుష్యం



మంగళగిరి టౌన్: ఉదయం 7 గంటల నుంచి సూర్యుడు భగభగమంటుండంతో ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. శనివారం ఎండ వేడిమికి మంగళగిరి నగర పరిధిలోని రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. మే నెలాఖరులో కొద్దిపాటి వర్షాలు పడడంతో వాతావరణం చల్లబడినప్పటికీ గత వారం రోజులుగా భానుడు భగభగ మంటున్నాడు. ప్రజలు రోడ్లపైకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. సాయంత్రం 5 గంటల తరువాతే రోడ్లపైకి వస్తున్నారు. రోహిణి కార్తె వెళ్లే వరకు ఎండలు ఇలాగే ఉంటాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఫిర్యాదులు రాకుండా చూసుకోండి

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



తెనాలి అర్బన్: ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి రోజు డోర్ టు డోర్ కలెక్షన్ జరగాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

డాక్టర్ 'గద్దె'కు ఘన నివాళి



తెనాలి రూరల్: పట్టణానికి చెందిన గుండె వైద్య నిపుణుడు డాక్టర్ గద్దె శివనాగమల్లేశ్వరరావు శుక్రవారం మృతి చెందారు. ఆయనకు ఐఎంఏ తెనాలి శాఖ సభ్యులు ఘన నివాళులర్పించారు. స్థానిక బోస్ రోడ్డులోని ఐఎంఏ కార్యాలయంలో శనివారం సాయంత్రం డాక్టర్ శివనాగమల్లేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె. అనిల్ కుమార్, డాక్టర్ మధు ప్రభాకర్ బాబు, డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ కె. శ్యాం ప్రసాద్, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ కోటి నాగయ్య, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, డాక్టర్ నరసింహారావు తదితర వైద్యులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో సత్తా



గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులను కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ అభినందించారు. శనివారం లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈనెల ఒకటిన రేపల్లెలో జరిగిన 23వ జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు బి.సుధారాణి, కె. ఓంకారేశ్వరరెడ్డి, పి.కౌశిక్ కృష్ణ, కేవీఎస్ మణికంఠ, వి.జస్వంత్ నాలుగు బంగారు, ఒక కాంస్య పతకాన్ని సాధించినట్లు వివరించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులు ఈనెల 9,10,11వ తేదీల్లో న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు.

వామ్మో జూన్.. ఖర్చులతో పరేషాన్

- తల్లిదండ్రులకు ఫీజుల భారం
- ఒక విద్యార్థి పుస్తకాలకు, బట్టలకు రూ. 15 వేల ఖర్చు
- రైతులకు పెట్టుబడి భారం
- విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు సతమతం

జూన్ రాగానే విద్యార్థుల తల్లిదండ్రులు, రైతుల్లో ఆందోళన మొదలవుతుంది. ఇటు తల్లిదండ్రులు పిల్లలకు పుస్తకాలతో పాటు యూనిఫారం, బ్యాగులు, షూలు, ఇతర ఫీజులు తప్పనిసరిగా చెల్లించాలి. తొలకరి వర్షాలు పడడంతో రైతులు ఖరీఫ్ సేద్యాన్ని ప్రారంభిస్తారు. పంటల సాగు నిమిత్తం పెట్టుబడుల కోసం వెతుకులాట ప్రారంభం అవుతుంది. ఒకవైపు విద్యా సంవత్సరం.. మరోవైపు ఖరీఫ్ సీజన్ ఒకేసారి ప్రారంభం అవడంతో అన్ని కుటుంబాలపై ఏదో రూపంలో జూన్ భారం పడుతుంది.

తాడేపల్లి రూరల్ : వేసవి సెలవులు ముగింపు దశకు వచ్చేశాయి. మరో వారం రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభం అవుతాయి. ఇప్పటికే ప్రైవేటు పాఠశాలలు తెరిచారు. పుస్తకాలు వచ్చాయని, వెంటనే తీసుకోవాలంటూ తల్లిదండ్రులకు ఫోన్‌ల మీద నిర్వాహకులు ఫోన్లు చేస్తున్నారు. ముందస్తు ఫీజులు, పుస్తకాలు కొనుగోలు చేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల మోత

మంగళగిరి నియోజకవర్గంలో 50 ప్రైవేటు, మూడు కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 10వేల మందికి పైగానే విద్యాభ్యాసం చేస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులంతా నోట్ల కట్టలతోనే పాఠశాలలకు వెళ్లాలి. నర్సరీ నుంచే ఫీజుల రూపంలో రూ. 20 వేల నుంచి రూ. 40 వేల వరకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు వసూలు చేస్తున్నాయి. ఇక పుస్తకాలు, యూనిఫామ్స్.. ఇలా అన్నింటికీ లక్షల్లోనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంట్లో ఇద్దరు పిల్లలు ఉంటే ప్రస్తుతం కొంత ఫీజు కట్టి, పుస్తకాలు,యూనిఫాం తీసుకోవాలంటే రూ. 50 వేల నుంచి రూ. 1 లక్ష వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇక ఇంటర్, ఇంజనీరింగ్ చదివే విద్యార్థులయితే వారు చదివే కళాశాలలను బట్టి ఒక్కొక్కరికి హాస్టల్, ఫీజులకు రూ. 3 లక్షల వరకు ఖర్చు అవుతోంది.



పొలం పనుల్లో నిమగ్నమైన రైతులు(ఫైల్)

పెట్టుబడి కోసం రైతుల అవస్థలు

జూన్ అనగానే రైతుల్లోనూ కలవరం మొదలవుతుంది. ఖరీఫ్ సీజన్ ఈ సమయంలోనే ప్రారంభం అవుతుంది. ముందస్తుగా కురిసిన వర్షాలతో దుక్కు పనుల్లో నిమగ్నం అయ్యారు. గత ఏడాది పంటలు చేతికి అందక, పెట్టుబడి కూడా రాలేదు. ఈ నేపథ్యంలో చేతిలో చిల్లిగవ్వ లేకుండానే వ్యవసాయ పనులు ప్రారంభించాల్సిన పరిస్థితి ఏర్పడింది. విత్తనాలు, పురుగుల మందుల కొనుగోలు, పొలం పనులు, కూలీల వేతనాలు ఇతరత్రా ఎకరాకు రూ. 30 వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది.



కూటమి ప్రభుత్వ మాయాజాలం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇప్పటికీ తల్లికి వందనం అందలేదు. పాఠశాలల ప్రారంభం రోజు అంటే జూన్ 12న తల్లుల ఖాతాల్లో ఈ డబ్బులు వేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. దాని కోసం పలువురు తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. ఇక అన్నదాత సుఖీభవ అమలు కోసం రైతులు కళ్లు కాయలు కాచేలా వేసి చూస్తున్నారు.

పేదలపై పెనుభారం



మాకు ముగ్గురు పిల్లలు. ఒక్క పుస్తకాలకే రూ. 20 వేలు కావాలి. అదనంగా యూనిఫామ్స్‌కు ముగ్గురికి ఆరు జతలకు రూ. 7 వేల నుంచి రూ. 8 వేలు ఖర్చు అవుతుంది. స్కూలు ప్రారంభమైన మొదటి వారంలోనే ఇవన్నీ కొనాలి. చిన్నచిన్న పనులు చేసుకునే మాలాంటి వారికి ఇది పెద్ద భారం.

–రోహిణి, తాడేపల్లి

పెట్టుబడులతో సతమతం



దుక్కి దున్నే దగ్గర నుంచి పొలంలో నాటు వేసే దాకా నెలకు రూ. 20 వేల చొప్పున మూడు నెలలకు గానూ ఎకరాకు రూ. 40 వేలు ఖర్చుపెట్టాల్సి ఉంటుంది. ఈ రోజుల్లో పల్లెటూర్లలో కూడా రెండు రూపాయలు వడ్డీ లేనిదే డబ్బులు ఇవ్వడం లేదు.

– రంగన శ్రీనివాసరావు, పెదకొండూరు

త్యాగమయ జీవితంతో బతుకు సార్థకం

- బక్రీద్ సందర్భంగా మంగళగిరి నియోజకవర్గంలో సామూహిక ప్రార్థనలు
- వేలాదిగా పాల్గొన్న ముస్లింలు



గౌతమ బుద్ధ రోడ్డులోని మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

మంగళగిరి టౌన్ : త్యాగమయ జీవితంతో బతుకు సార్థకమవుతుందని ముస్లిం మత పెద్దలు తెలియజేశారు. ప్రతి ఒక్కరు సేవాగుణం అలవర్చుకోవాలన్నదే బక్రీదు పండుగ ముఖ్య ఉద్దేశమని సందేశాన్ని ఇచ్చారు. మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం బక్రీదు పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చిన్నారులు, పెద్దలు పరస్పరం ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. అధికార, అనధికార ప్రముఖులు పాల్గొని, ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాలలోని ముస్లింలు ఆయా ప్రాంతాల మసీదులకు చేరుకుని భక్తిశ్రద్ధలతో ప్రార్ధనాలు నిర్వహించారు. పండుగ విశిష్టతను మౌలానాలు వివరించారు. హజరత్ ఇబ్రహీం మహోన్నత త్యాగం మానవాళికి గొప్ప సందేశాన్ని అందించిందని మత పెద్దలు గుర్తు చేశారు. ఆయన త్యాగనిరతిని గుర్తు చేసుకోవడం అందరి విధి అని సందేశమిచ్చారు. అన్ని మతాల మధ్య సయోధ్య, సహకార భావనను బక్రీద్ తెస్తుందన్నారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఖుర్బానీని ప్రారంభించి బంధువులు, మిత్రులకు మాంసాహారం పంచిపెట్టారు. పేదలకు వస్త్రదానంతో పాటు పలువురు ముస్లింలు వారికి తోచిన సాయం అందజేశారు. మిత్రులును, బంధువులను ఇళ్లకు ఆహ్వానించి విందు భోజనాలు ఏర్పాటు చేశారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి



రాజును సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

ఫిరంగిపురం: మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు రాజు ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ వింగ్ మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో శనివారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రాజును శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు, మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొమ్మారెడ్డి చిన్నప్పరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో షేక్ కబీర్, విజయరామారావు, శంకర్, రామయ్య, ఆనంద్, రామారావు, బాబురావు పాల్గొన్నారు.

కౌలు రైతులకూ 'అన్నదాత సుఖీభవ' ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు

దుగ్గిరాల: నూటికి డెబ్బై శాతం కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారని, వారందరికీ అన్ని ప్రభుత్వ పథకాలు అందజేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. దుగ్గిరాల మండలం చిలువూరులో శనివారం ఆయన రైతులతో మాట్లాడారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11న మంగళగిరి వ్యవసాయ కమిషనర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న నిరసనలో రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కౌలు రైతులకు కూడా భూమి యజమానితో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ కింద ఇచ్చే రూ. 20 వేలు, పంట రుణాలు, రైతుభరోసా, పంట నష్ట పరిహారాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెట్టి బాలరాజు, అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

ధ్వజ స్తంభం వద్ద దర్శనమిచ్చిన చీపురు

- ఆలయ పవిత్రతను కాపాడాలంటున్న భక్తులు
- షోకాజ్ నోటీస్ ఇస్తామన్న ఈవో



ధ్వజ స్తంభం వద్ద దర్శనమిస్తున్న చీపురు

మంగళగిరి టౌన్: పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ధ్వజ స్తంభం వద్ద శనివారం భక్తులకు చీపురు దర్శనమిచ్చింది. ధ్వజ స్తంభం చుట్టూ కొంత చెత్త, చీపురు ఉండడంతో పలువురు భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఆలయ పవిత్రతను కాపాడాలని అధికారులను కోరుతున్నారు. ఈ ఘటనపై సోషల్ మీడియాలో వార్తలు రావడంతో ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్‌ను సాక్షి వివరణ కోరింది. ధ్వజ స్తంభం వద్ద చీపురు ఉంచడకూడదని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందికి షోకాజ్ నోటీసు జారీ చేస్తామని ఆయన తెలియజేశారు. పవిత్రమైన దేవాలయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

చిచ్చు పెట్టి చోద్యం చూస్తున్న మంద కృష్ణ మాదిగ



దుగ్గిరాల: అమాయక మాదిగ జాతిని సర్వనాశనం చేయడానికి దాపురించిన శకుని మంద కృష్ణ మాదిగ అని ఏపీ ఎమ్మార్పీఎస్ స్టేట్ లీగల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ అన్నారు. శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద, అమాయక మాదిగ యువకుల ఆత్మ బలిదానాలు బలమైన పునాదులుగా నిర్మితమైన ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని నిస్సిగ్గుగా కుటుంబం ఆర్థిక వనరుగా మార్చుకున్న మాదిగ జాతి నమ్మక ద్రోహి మంద కృష్ణ మాదిగ అని విమర్శించారు. అంబేడ్కర్ ఆశయాలకు విరుద్ధంగా ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని నరనరాన జీర్ణించుకున్న బీజేపీతో ఉంటే ఆయన ఆత్మ క్షోభిస్తుందని తెలిపారు. మాల, మాదిగల మధ్య దూరం పెరగకుండా భవిష్యత్తులో కలిసి ఐక్యపోరాటాలు చేయాలని ఆయన కోరారు. కృష్ణ మాదిగ ఇద్దరి మధ్యా విభేదాలు, విద్వేషాలు రెచ్చగొడుతున్నారని, ఇకనైనా విషం చిమ్మకుండా ఉండాలని ఆయన హితవు పలికారు.

ఘనంగా సువర్ణ భారతి క్షేత్రం భూమిపూజ



తెనాలి: స్థానిక బుర్రిపాలెంరోడ్డులో వివేకానంద సెంట్రల్ స్కూలు దగ్గర నూతనంగా నిర్మించనున్న శ్రీసువర్ణ భారతీ క్షేత్రం (సరస్వతి దేవాలయం) భూమిపూజ శనివారం ఘనంగా నిర్వహించారు. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) మాట్లాడుతూ రాష్ట్రంలో తొలి సరస్వతి దేవాలయం లక్ష పలకలతో తెనాలిలో నిర్మించటం గొప్ప విషయమని చెప్పారు. సరస్వతి దేవి విశిష్టతను భక్తులకు తెలియజేశారు. పెదపులిపాక శ్రీవిజయ రాజరాజేశ్వరి శ్రీవిద్యాపీఠం పీఠాధిపతులు శ్రీవాసుదేవానంద గిరి స్వామి భూమిపూజలో పాల్గొని విశేష ప్రవచనం చేశారు. విజయవాడలోని అష్టాక్షరి ఆశ్రమం నుంచి శ్రీమన్నారాయణ అష్టాక్షరి సంపత్‌కుమార రామానుజ జీయర్‌స్వామి భక్తుల నుద్దేశించి మాట్లాడారు. స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠం, శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం దంపతులు, టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు కృష్ణ-గుంటూరు జిల్లా అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసు (వాసు), కార్యదర్శి రావూరు సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ప్లేస్‌మెంట్స్ సక్సెస్ మీట్



ప్రసంగిస్తున్న వీసీ పార్థసారథి వర్మ

తాడేపల్లి రూరల్ : వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ సక్సెస్ మీట్ సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీల సీఈఓలు బొల్లినేని సురేష్‌బాబు, డాక్టర్ పి. వేణుగోపాలరావు, శామ్యూల్, వి.ఎస్.ఆర్. ప్రసాద్ ఒరుగంటి, రామ్‌చందర్ తదితరులు ముఖ్య అతిథిలుగా హాజరై, విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. సదస్సులో యూనివర్సిటీ వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగంలో వంద శాతం ప్లేస్‌మెంట్స్ రికార్డు సాధించినట్లు తెలిపారు. మేనేజ్‌మెంట్, వ్యవసాయ, ఫార్మసీ, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల విద్యార్థులు 1500 మంది 155కు పైగా కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. యూనివర్సిటీ ప్రో వీసీ ఎన్. వెంకటరామ్ మాట్లాడుతూ ఏ కోర్సు చదివినా మంచి ప్యాకేజీతో ప్లేస్‌మెంట్ వచ్చేలా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ప్రో వీసీ ఎ.వి.ఎస్. ప్రసాద్, కె. రాజశేఖరరావు, రిజిస్ట్రార్ కె. సుబ్బారావు, ఎంహెచ్‌ఎస్ డీన్ ఎం. కిశోర్ బాబు, అకడమిక్ అడిషనల్ డీన్ హరికిరణ్ వేగే, స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ ఎ. శ్రీనాథ్, ప్లేస్‌మెంట్ అసోసియేట్ డీన్ పి. చలపతి, సీనియర్ డైరెక్టర్ శరవణ బాబు, అడ్మిషన్ల డైరెక్టర్ జె. శ్రీనివాసరావు, అన్ని విభాగాల విభాగాధిపతులు పాల్గొన్నారు.

ప్రపంచ ప్రార్థన దినోత్సవాన్ని జయప్రదం చేయండి



చర్చి ప్రారంభోత్సవంలో పాల్గొన్న క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు

మంగళగిరి టౌన్ : ప్రపంచ ప్రార్థన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు కోరారు. మంగళగిరి నగర పరిధిలోని రత్నాల చెరువులో పెంతకోస్తు పండుగను పురస్కరించుకుని శనివారం ఏసుక్రీస్తు ప్రార్థన మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ తరఫున పలువురు దైవ సేవకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ తిమోతి మాట్లాడుతూ పెంతకోస్తు పండుగ అనేది క్రైస్తవంలో ముఖ్యమైన పండుగని తెలిపారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ఆదివారం ప్రపంచ ప్రార్థన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 6 గంటలకు నగర పరిధిలోని టిప్పర్ల బజారులో వున్న షాదీఖానా నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. క్రైస్తవులందరూ పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు మోజెస్, మోషే, దేవరాజు పాల్గొన్నారు.

కారు-ద్విచక్ర వాహనం ఢీ

- ఇద్దరికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



ప్రమాదంలో దెబ్బతిన్న ద్విచక్ర వాహనం

తాడికొండ: కారు-ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన ఘటన శనివారం తాడికొండ అడ్డరోడ్డులో జరిగింది. మేడికొండూరు మండలం నుంచి తుళ్లూరు మండలం పెదపరిమిలో శుభాకార్యానికి కారు వెళుతోంది. ఈ సమయంలో తాడికొండ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని తాడికొండ అడ్డరోడ్డులో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు, ద్విచక్ర వాహనం ముందు భాగాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరి యువకుల్లో ఒకరికి కాలు విరిగి తలకు బలమైన గాయం కాగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితులను ఆటోలో గుంటూరు ఆసుపత్రికి తరలించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

డ్రైవర్స్ కాలనీలో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం



ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో రోడ్డుపై మురుగు నీరు నిల్వ

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని డోలాస్‌నగర్ డ్రైవర్స్ కాలనీలో పారిశుద్ధ్యం నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. ప్రభుత్వ వైద్యశాల వద్ద రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉంది. ఎదురుగా ఉన్న డ్రైనేజీ పగిలి ఆసుపత్రికి పది అడుగుల దూరంలో రోడ్డు మీదకు మురుగునీరు వచ్చి దుర్వాసన వెదజల్లుతోంది. ఆ మురుగు నీటిపై దోమలు తేలియాడుతున్నాయి. సచివాలయం నుంచి డోలాస్‌నగర్ మెయిన్ రోడ్ వరకు ఏర్పాటు చేసిన డ్రైనేజీలో మురుగు నీరు ప్రవాహం నిలిచిపోయింది. డ్రైనేజీకి ఏర్పాటు చేసిన పైపుల ద్వారా వంటగదిలోకి, బాత్‌రూమ్‌లోకి వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు పైపైనే పూడిక తీసి వెళ్లిపోతున్నారని ఆరోపించారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి డ్రైనేజీలో పూడిక తీసి మందులు పిచికారీ చేయాలని నివాసితులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

దుగ్గిరాల: మండలంలోని ఈమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం ఘనంగా జరిగింది. రెండు దశాబ్దాల అనంతరం ఒక్కచోట కలవడంతో సందడి నెలకొంది. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ సమావేశానికి పూర్వ ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు అధ్యక్షత వహించారు. విద్యా బుద్ధులు నేర్పించి ఉన్నత శిఖరాలకు అధిరోహించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు.


లెదర్ పుట్‌వేర్ కాంప్లెక్స్‌లను నిర్మించాలి



సమావేశంలో పాల్గొన్న చర్మకార సంఘ నాయకులు

దుగ్గిరాల: ప్రతి నియోజకవర్గం, మండల కేంద్రాల్లో లెదర్ పుట్‌వేర్ కాంప్లెక్స్‌లను ప్రభుత్వం నిర్మించాలని దుగ్గిరాల మండల చర్మకార సంఘ అధ్యక్షుడు కొమ్మూరి రవికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. దుగ్గిరాల ఎస్సీ కమ్యూనిటీ హాలు దగ్గర శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చర్మకారులకు, డప్పు కళాకారులకు రూ. 2 లక్షల రుణం అందజేసి, వారి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ మేరకు మంత్రి నారా లోకేష్‌కి సభ్యుల సమక్షంలో తీర్మానం చేసి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బి.రాజారావు, ఎ.ధనుంజయ్, ఎస్. కోటేశ్వరరావు, కె. సుబ్బారావు, ఎస్.ప్రకాష్, నతానియేలు పాల్గొన్నారు.

186వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు



తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు బకాయిల కోసం నిర్వహిస్తున్న దీక్షలు శనివారం 186వ రోజుకు చేరుకున్నాయి. శిబిరాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగ వెంకటేశ్వర్లు ప్రారంభించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుల విధానాల వల్ల 170 మందికి పైగా ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. 33 సంవత్సరాల కిందట ఫ్యాక్టరీ మూతబడిందని, కార్మికుల సమస్య మాత్రం ఇంకా పరిష్కారం కాలేదని విమర్శించారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల తలరాత మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, డి.నాగేశ్వరరావు, గురవయ్య, ఇస్మాయిల్, పిచ్చయ్య, సారమ్మ, దుర్గా భవాని, ఇమాంబి పాల్గొన్నారు.